# పాపం మీరా

"డాక్టర్ ఏమన్నాడురా మదన్!"

"ఉష్ - మీరా ఎక్కడుంది?"

"ఇక్కడలేదులే స్నానంచేస్తోంది చెప్పు"

"నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదన్నాడమ్మా!"

"ఆ! నిజంగానా?!"

"నిజమేనమ్మా! డాక్టర్ మమ్మల్ని పరీక్ష చేసి చెప్పిందేమంటే మీరాలో ఎట్టి లోపం లేదని, నాలోనే వుందని, నాకు పిల్లలు పుట్టరనీ ఖచ్చితంగా చెప్పేశాడు."

సరోజమ్మ తల గిర్రున తిరిగిపోతోంది.. మదన్ చెప్పిన విషయం విన్న దగ్గర మంచి ఆమెకి ఏం చెయ్యాలో తోచటంలేదు.

మదన్ పెళ్ళయి ఆరేళ్ళు దాటింది. పెళ్ళయిన ఏడాది దాటగానే సరోజమ్మకి అనుమానం కలిగి కోడల్ని పిల్చి అడిగింది. "పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడుతున్నారేమిటమ్మా!" అంటూ.

అబ్బే - అదేంలేదని మీరా చెప్పిన సమాధానం ఆమెకి నమ్మాలనిపించలేదు. అలా నెలలు గడిచిపోతున్నాయి.

గిర్రున నాలుగేళ్ళు తిరిగిపోయాయి. గత కొద్ది నెలలుగా మీరా కనిపించిన చంటి బిడ్డనల్లా ఆత్రంగా ఎత్తుకోవడం, ముద్దులాడటం చూసిన సరోజమ్మకి మీరా పిల్లల కోసం తహతహలాడుతోందని అర్థమయింది. ఇప్పుడు పిల్లలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదని కూడా స్పష్టమయింది. ఓ సారి మీరాని లేడీ డాక్టర్ వద్దకి తీసుకెళ్ళిచూపింది. చిన్న ఆపరేషన్ చేస్తే పిల్లలు పుట్టొచ్చని అంటే అదీ చేయించారు. అయినా లాభం లేకపోవడంతో సహజమైన అత్తగారి ధోరణి సరోజమ్మలో తలెత్తింది. కోడల్ని గొడ్రాలివని సాధించేది. చుట్టాలూ, స్నేహితులతో కోడలికి పిల్లలు పుట్టడంలేదని, కొడుక్కి గొడ్రాలిని కట్టబెట్టారని అవమానించేది. భర్త కూడా తల్లికి వంతపాడి మీరాని నిందించేవాడు. ఈ అవమానాలకి తోడు ఇరుగుపొరుగులు కూడా మీరాని యిది వరకులా తమ బిడ్డల్ని ముట్టనిచ్చేవారు

కాదు. గొడ్రాలి చూపు మంచిదికాదని, గొడ్రాలు ఎత్తుకున్న పిల్లలు దక్కరని నమ్మేవాళ్ళు మీరా ఎత్తుకున్న పిల్లని చటుక్కున లాక్కుని, చుర చుర చూస్తూ కొందరెళ్ళిపోతే, "మా పిల్లల్నయినా సుఖంగా బ్రతకనీ తల్లీ!" అంటు మరికొందరు మీరాని నొప్పించి మరీ లాక్కెళ్ళేవారు. అది చూసిన సరోజమ్మ కోడల్ని ఓదార్చడానికి బదులు మరో నాలుగు దెప్పిపోట్లతో బాధించేది.

స్వతహాగా నెమ్మదస్తురాలైన మీరాకి అత్త, భర్త సాధింపులు, ఊళ్ళోవాళ్ళ దెప్పి పోట్లు నొప్పించి, బాధపెట్టేవి. పైకి ఎవ్వర్నీ ఏమీ అనలేక లోలోపలే కృంగి పోయేది. రాను రాను మీరాకు యిల్లు నరకమవసాగింది. ఇక తట్టుకో లేని మీరా ఓ నాడు భర్తతో మీరు కూడా వెళ్ళి డాక్టర్ చేత పరీక్ష చేయించుకొనిరండని బ్రతిమాలింది. అసలే కోపిష్టి అయిన మదన్ మీరా మాటలకి తోక తొక్కిన త్రాచులా లేచి మీరాని కొట్టినంత పని చేశాడు.

కొత్తగా ఆ వూరి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన డాక్టర్ అశోక్, మదన్ మంచి స్నేహితులు కావడంతో మదన్ కుటుంబ విషయాలడుగుతూ 'పిల్లలెం'దరని అడిగినప్పుడు తమ పరిస్థితి చెప్పి పిల్లలు లేరని బాధ పడ్డాడు. అశోక్ యిద్దర్నీ పరీక్ష చేస్తానని చెప్పినప్పుడు తన్ని పరీక్ష చేసినట్లు మీరాకి తెలియనివ్వవద్దని బ్రతిమాలటంతో యిద్దర్ని వేరే వేరే రోజులు పరీక్షించాడు. అమ్మ కూచయిన మదన్ తల్లి దగ్గర విషయం దాచలేక అశోక్ చెప్పిన విషయమంతా రహస్యంగా ఆమెకి వివరించాడు.

ఈ విషయాలు తెలిసిన తరువాత తల్లీ, తనయుడూ యిన్నేళ్ళూ మీరాని ఆడిన మాటలికి పశ్చాత్తాపం పడటానికి బదులు, ఈ విషయం ఆమెకి తెలీకుండా రహస్యంగా ధాచి, తమ పరువు కాపాడుకోవాలని, మీరా వద్ద లోకువ అవకూడదని నిర్ణయంచుకున్నారు. మీరాకీవిషయం తెలిసిపోతే ఇన్నేళ్ళూ తాము చేసిన పనికి పగతీర్చుకోవచ్చున్న భయం కూడా కలగసాగింది.

చాదస్తురాలైన సరోజమ్మ కొడుక్కి పిల్లలు పుట్టరని తెలిసిన నాటి నుంచి కొడుకుల్లేని వారి జన్మపున్నామ నరకమన్న మూఢ నమ్మకంతో బెంగపడిపోయేది. ఏదో ఓ రోజు కొడుకు విషయం బయట పడకపోదన్న భయం కూడా ఆమెలో కలిగింది. దాంతో మరీ పిచ్చిగా మీరాని హింసించేది.

మీరా రోజు రోజుకీ నీరసించడం గమనించిన సరోజమ్మ లేడీ డాక్టర్ వద్దకి మీరాని తీసుకెళ్ళి చూపించింది. మీరాకి మూడవ మాసమని ఆ డాక్టర్

చెప్పగానే పిల్లల కోసం పరితపించే మాతృ హృదయం, మనుమల కోసం కలువరించే బామ్మ మనసు ఆనందంతో పులకరించిపోయి పరిసరాల్నే మరిచిపోయి ఒకరి నొకరు కౌగలించేసుకున్నారు. ఆ యిద్దరి ఆనందాన్నీ చూస్తున్న లేడీ డాక్టర్ కూడా సంతృప్తిగా నవ్వి వారికి తగిన జాగ్రత్తలు చెప్పి మందులిచ్చి పంపించింది.

ఆ రోజు నుంచి సరోజమ్మ కోడల్ని కాలుకింద పెట్టనివ్వకుండా యింటెడు చాకిరీ చేస్తూ మీరాని ఎంతో జాగ్రత్తగా చూసుకోసాగింది.

నెలలు నిండాయి. మంచి నర్సింగ్ హోంలో పండంటి బాబుని కన్న మీరా మాతృ హృదయం గర్వంతో ఉప్పొంగిపోయింది. నానమ్మగా సరోజమ్మ చేస్తున్న హడావిడి వర్ణనాతీతం. మనమడు పుట్టాడని తెలియగానే ఊరంతా స్వీట్లు పంచింది. పెద్ద ఎత్తున నామ కరణానికి ఏర్పాట్లు చేయించి బంధు, మిత్రులందరికీ ఉత్తరాలు రాసింది. బారసాలకి తప్పక రమ్మని మరీ మరీ రాసింది.

బారసాలకి వస్తున్న చుట్టాలందరికీ బట్టలు కొనాలని లిస్టు రాయసాగింది. మనుమడికి కొంటున్న నగలు, బట్టలు సంగతి సరేసరి.

అందరికన్నా ముందుగా సరోజమ్మ రెండో కొడుకు గోపాల్ దిగాడు. మీరాని అభినందించి, బాబుని ఎత్తుకుని ముద్దులతో ముంచెత్తాడు. సరోజమ్మ మనవడిని వర్ణించి, వర్ణించి చెస్తోంది.

మర్నాడే నామకరణ మహోత్సవం. ముఖ్యమైన బంధువర్గంతో ఇల్లంతా సందడిగా వుంది. రాత్రి వరకూ మర్నాటి పనులకి కావలసిన ఏర్పాట్లన్నీ చేసిన సరోజమ్మ గదిలో కెళ్ళి పడుకుంది.

రాత్రి రెండు గంటలు దాటి వుంటుంది. అంతా గాఢ నిద్రలో మునిగి వున్నారు. అంతలోనే వినపడింది చావుకేక. ఒక్కసారిగా అందరిళ్ళలో లైట్లు వెలిగాయి. నాలుగో అంతస్తులో వున్న సరోజమ్మగారిట్లో జనమేకాకుండా ఆ మేడలో వుండే కుటుంబాలు, చుట్టు పక్కల యిళ్ళ వాళ్ళూ పరిగెత్తుకు వచ్చారు. కింద నెత్తురు మడుగులో కొట్టుకుంటున్న ఆకారాన్ని చూసి కొందరు కళ్ళు మూసుకున్నారు. మరికొందరు పారిపోయారు ఆ దృశ్యం చూడలేక. "ఇంకా ప్రాణం వుంది డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళండి" అన్నారు కొందరు. ఆ దృశ్యాన్ని

చూసిన సరోజమ్మ ఘొల్లున గోలెడుతు పరిగెత్తుకొచ్చింది. గుడ్ల నీళ్ళుకుక్కుకుంటు దగ్గరగా వచ్చి రెండు చేతుల్తో ఎత్తబోతున్న మదన్‌వైపు, తల బాదు కుంటూ ఏడుస్తున్న సరోజమ్మ వైపు నిరసనగా, అసహ్యంగా ఓ చూపు చూసి, అయిష్టంగా ముఖం పక్కకి తిప్పి శాశ్వతంగా కళ్ళుమూసింది మీరా.

ఏ ఒక్కరికీ మీరా ఆత్మహత్యకి కారణం అర్థంకావటంలేదు. పిల్లలకోసం పరితపించే మీరా పండంటి కొడుకు నెత్తుకున్నా ఎందుకీ అఘాయిత్యం చేసిందన్న ప్రశ్న అందరి మెదడుల్ని తొలచసాగింది.

"అమ్మా! నీ కోరిక తీరిందా? మనవడిని ఎత్తుకోడం ముచ్చట తీరడంతోపాటు, అన్నయ్యకి పిల్లలు పుట్టరన్న రహస్యం వదినకి తెలీకుండా మనం వేసిన ప్లాను ఎంత బాగా పన్జేసిందో చూసావా? బాబు అచ్చు నా పోలికే కదూ?" అన్న మాటల్ని అప్పుడే బాత్రూం కెళ్ళి వచ్చిన మీరా వినడం, వెంటనే కొద్ది నెలల క్రితం మరిది గోపాల్ రావడం, ఆ రాత్రి అన్నదమ్ములు రెండో ఆట సినిమాకి వెళ్ళడం, ఆ రాత్రే ఏదో మత్తుగా, శరీరం బరువుగా వుండి రాత్రల్లా లేవలేకపోవడం, ఆ మత్తులోనే తనపక్క పడుకున్న వ్యక్తి తనతో ఆ రాత్రి గడిపిన అనుభవం కొత్తగా వుండటం లీలగా యిప్పుడిప్పుడే ఘుర్తుకురావడం, దానకి కారకులెవరో యిప్పుడే స్పష్టమవడంతో వళ్ళంతా అసహ్యంతో కంపించసాగింది. అంతే!!

సాటి ఆడదన్న అభిమానం లేకుండా స్వార్థం కోసం ఎంత నీచానికైనా తెగించే సరోజమ్మ వంటి అత్తలున్నంతకాలం, కట్టుకున్న భార్యకి ఆప్యాయత అనురాగం పంచలేని భర్త, తల్లికి తందానతాన పాడే తనయులు వున్నంతకాలం, ప్రాణంకన్నా శీలమే ముఖ్యమనుకునే స్త్రీలు మనదేశంలోవున్నప్పుడు ఏ స్త్రీ అయినా తన జీవితాన్ని యిదే విధంగా ముగించుకుంటుందేమో!!

చావు ఏ సమస్యలకీ పరిష్కారంకాదనుకునే వాళ్ళకి కూడా మీరా ఆత్మహత్యలోని అంతర్యం తెలిస్తే జాలిపడక పోరేమో! కానీ ఎలా తెలుస్తుంది? సరోజమ్మ, మదన్, గోపాల్ వంటి మూర్ఖులు ఎలాగా చెప్పి చెడ్డ వాళ్ళవరు - అందువల్ల ఆ రహస్యం బైటి ప్రపంచానికి తెలీకుండా మీరాతోనే సమాధి అయిపోయింది. ✳

(నవంబర్ 1988 వనితాజ్యోతి)